ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

5

అల్లూరి సీతారామరాజు

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: కొర్రాయి పంచాయతీ జకరవలస గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి స్థానిక పంచాయతీ సర్పంచ్ పి.కొములు శనివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ములు మాట్లాడుతూ, పంచాయతీ నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలతో పాటు వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం ఉధృత పోరాటం

- సమాయత్తమైన ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, ప్రజా సంఘాలు
- 27 నుంచి నిరసన కార్యక్రమాలు
- మే 2 నుంచి మన్యం బంద్

సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స, వేదికపై ఎంపీ తనూజారాణి

ప్రజాశక్తి -పాడేరు : ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి సాధనకై ఉద్యమించేందుకు మన్యంలోని ఉద్యోగ ఉపాధ్యాయ, నిరుద్యోగ ప్రజా సంఘాలు సమాయత్తమయ్యాయి. స్థానిక కాపీ హౌస్‌లో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ భవిష్యత్తు కార్యాచరణ పై రాష్ట్రస్థాయి చర్చా వేదిక సమావేశం శనివారం నిర్వహించారు. అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనుజారాణి, వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల పై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేయాలని, లేక ప్రెసిడెంట్స్ ఉత్తర్వులు జారీ చేయాలని, టిఏసి తీర్మానం అమలు ప్రక్రియ పెండింగ్‌లో ఉండగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని పలు సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సి సాధన కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈ మేరకు ఈనెల 27న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ పత్రాలు దగ్ధం కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ నిర్వహించాలని, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని నిర్ణయించారు. 28న జిల్లా, మండల స్థాయిలో ఆదివాసీ ఉద్యోగ ఉపాధ్యాయ, ప్రజా సంఘాల, రాజకీయ పార్టీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం, బంద్ జయప్రదానికి సన్నాహాలు, జిల్లా, మండల స్థాయిలో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ నియామకం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి వినతి పత్రం సమర్పణ, రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రులకు ఇమెయిల్, సోషల్ మీడియా ద్వారా వినతిపత్రం పంపించుట, రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం సమర్పణ, మే 2న అన్ని మండలాల్లో బంద్ వంటి దశల వారి ఆందోళన కార్యక్రమాలను కొనసాగించ డానికి కార్యాచరణ ప్రకటించారు.

శత శాతం రిజర్వేషన్ సాధ్యమే
రాష్ట్రీయ ఆదివాసీ అధికార్ మంచ్ సభ్యులు అప్పలనర్స

ఏజెన్సీలో ఆదివాసీ యువత నూరు శాతం రిజర్వేషన్ పై ఉద్యోగ అవకాశాలు పొందడం సాధ్యమేనని, దీన్ని ఐక్యంగా సాధించుకోవాలని రాష్ట్రీయ ఆదివాసీ అధికార్ మంచ్ సభ్యులు పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. జీవో 3 సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆదివాసీలకు నూరు శాతం రిజర్వేషన్ ఇవ్వొద్దని చెప్పలేదన్నారు. గిరిజన హక్కుల భక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కుయుక్తులు పన్నుతున్నాయని విమర్శించారు. ఆదివాసీ సంఘాలు నిరంతరం వీటి రక్షణ కోసం పోరాడుతూనే ఉన్నాయని చెప్పారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలని, ఒకసారి నియామకాలు పూర్తయితే తర్వాత ఆపలేమని తెలిపారు. ఉద్యోగ ఉపాధి రంగాల్లోనే కాకుండా రాజకీయ అవకాశాలు కూడా సన్నగిల్లిపోతాయన్నారు. స్థానిక సంస్థల్లో కూడా నూరు శాతం రిజర్వేషన్ అమలుకు భంగం కలుగుతుందని, ఐక్యంగా నిలిచి పటిష్ట ఉద్యమంతో నూరు శాతం రిజర్వేషన్ సాధించుకోవాలని అప్పలనర్స పిలుపునిచ్చారు.

జీఒ 3ను పునరుద్ధరించుకోవడమే లక్ష్యం
అరకు పార్లమెంట్ సభ్యురాలు తనుజారాణి

జీవో 3ని పునరుద్ధరించుకోవడం లేదా ప్రత్యామ్నాయం కోసం పోరాటం సాగించి నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్లు సాధించుకోవడమే అందరి లక్ష్యం కావాలని అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనుజారాణి పిలుపునిచ్చారు, ఆదివాసి సంఘాల ఉద్యమ స్ఫూర్తితో తాను కూడా పార్లమెంట్‌లో గిరిజన రిజర్వేషన్ల సాధనకై పోరాడుతానని చెప్పారు ఈ ఉద్యమంలో తాను ఆర్థికంగాను ప్రజా సంఘాలకు అన్ని విధాలుగా సహాయ పడతానని చెప్పారు ఉపాధ్యాయ సంఘం నేత కాంతారావు మాట్లాడుతూ, సుప్రీంకోర్టులో జీవో 3 చట్టం పెండింగ్లో ఉండగా మెగా డీఎస్సీలో ఆదివాసిలకు ఆరు శాతం రిజర్వేషన్ ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నాయుడు జీవో 3 పునరుద్ధరణ పై ఇప్పటికే మూడుసార్లు ప్రకటించారని, ప్రత్యామ్నాయ చట్టం తీసుకొస్తామని కూడా చెబుతున్నారని దీన్ని సాధించు కోవడమే మన కర్తవ్యమని చెప్పారు:
డీఈవో జిల్లా అధ్యక్షుడు ఎస్.మాణిక్యం మాట్లాడుతూ, జీవో 3కి ప్రత్యామ్నాయం కోసం పోరాడి సాధించుకోవాల్సిన కర్తవ్యం అందరిపైనా ఉందని అన్నారు. స్పెషల్ డిఎస్సీ సాధించుకోవాలని, ఇది ఆదివాసీల జీవన్మరణ సమస్యలాంటిదని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ ఆదివాసి ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, పోలవరం నిర్వాసితులు

ప్రతి నిర్వాసితునికీ న్యాయం చేస్తాం : పిఒ అపూర్వ భరత్

ప్రజాశక్తి-విఆర్.పురం : పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి నిర్వాసితునికి న్యాయం చేస్తామని చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ అన్నారు. పోలవరం ముంపునకు గురవుతున్న కూనవరం, విఆర్ పురం చింతూరు మండలాలోని కూనవరం, వడ్డిగూడెం, చొప్పలి, మల్లెతోట గ్రామాలలో శనివారం ఆర్ అండ్ ఆర్ గ్రామసభలు నిర్వహించారు. అర్హుల్లు, అనర్హుల్ల జాబితాను ప్రజా ప్రతినిధులు, అధికారులు, నిర్వాసితుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రెండు జాబితాలో పేర్లు లేనివారు ఈ గ్రామసభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామసభ జరిగిన నాటి నుండి 15 రోజుల వరకు నిర్వాసితులు నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. డ్రాఫ్ట్ ఆర్అర్ ప్యాకేజీ ప్రతిపాదనలు పంపడానికి నిర్వాసితుల నుండి ఫిజికల్ డాక్యుమెంట్స్ అవసరం అవుతాయని తెలిపారు. అందువల్ల అందరూ ఫిజికల్ డాక్యుమెంట్స్ పంచాయతీ వారికి సమర్పించాలని కోరారు. ఈ నాలుగు గ్రామాలలో మొత్తం 2841 మంది పిడిఎఫ్‌లు ఉన్నారని, వారిలో 2521 మంది అర్హుల్లు, 320 మందిని అనర్హుల్లగా గుర్తించడం జరిగిందని చెప్పారు. అనర్హుల్ల నుంచి తీసుకున్న దరఖాస్తు పరిశీలించి వారిని కూడా రెండవ గ్రామసభ నాటికి అర్హుల్లుగా గుర్తించి వారికి కూడా న్యాయం చేయటం జరుగుతుందని చెప్పారు. నిర్వాసితులు ఎవరు కూడా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసోవద్దని హితవుపలికారు. ఇప్పటి వరకు వరకు 28 గ్రామసభలు నిర్వహించడం జరిగిందని, మిగిలిన 4 గ్రామాల గ్రామసభలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ గ్రామసభల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలోని 8 (బాలురు - 4, బాలికలు - 4) ఎపి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఒలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థిని, విద్యార్థుల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుండి మే 18వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. https:twreiscet.apcfss.in ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని, ఇందులో జనరల్, వికలాంగుల కోటా - 36 సీట్లు, ఎస్‌సి-1, బిసి-1, ఏజన్సీ ఎంప్లాయీస్ కోటా-1 సీటు, ఒసి-1 సీటు) కేటాయించనిట్లు తెలిపారు. ఆసక్తి గల వారు దగ్గరలో గల ఏదైనా గురుకుల విద్యాలయంలోనూ, లేదా మీసేవా కేంద్రంలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని గిరిజన విద్యార్థిని, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సమీప గురుకుల కళాశాల ప్రిన్సిపాల్స్‌ను లేదా రంపచోడవరం గురుకుల కళాశాల (బాలురు) కన్వీనర్ ప్రిన్సిపాల్‌ను, లేదా 9490957242 నెంబర్‌లోగాని సంప్రదించాలని కోరారు.

గెడ్డ పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాన్ని ఆపాలి

- సిపిఎం నేతల డిమాండ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ట్రైబల్ కాటేజీ పక్కన గెడ్డ పోరంబోకు స్థలంలో పాంగి చిన్నారావు గిరిజనేతరులకు అండగా ఉండి నిర్మిస్తున్న భారీ అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్న స్థలంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల నాయకులు కిల్లో జగన్నాధం, కొర్రా మగ్గన్న, కిల్లో సహదేవ్, పాంగి రామన్న పర్యటించి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ కంఠబొన్సుగుడ పరిధిలో సర్వే నెంబర్ 26 బిలో విద్యుత్ పవర్ లైన్ 33 కెవి తీగలు ఉన్నాయని, దీనిని ఆనుకొని ఉన్న గెడ్డ పోరంబోకు భూళీ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి అడ్డదారిలో చట్ట విరుద్ధంగా భారీ భవన నిర్మాణాన్ని చేపడుతున్నారన్నారు. ఈ గెడ్డ పోరంబోకు స్థలంలో పాంగి చిన్నారావు, మాజీ సర్పంచ్ బినామిగా ఉండి నిర్మాణం చేపడుతున్నారన్నారు. కోట్లాది రూపాయలతో పెట్టుబడి చేసి నిర్మిస్తున్నారని, దీని వెనకాల గిరిజనేతరుల హస్తం ఉన్నట్టు తెలిసిందన్నారు. ఈ గెడ్డ పోరంబోకు స్థలంలో వ్యాపార సముదాయాలు నిర్మించి వ్యాపారం చేసుకోవడం చట్ట విరుద్ధమన్నారు. గెడ్డ పోరంబోకు స్థలంలో కోట్లాది రూపాయలతో బినామీ పేరుతో గిరిజనేతరులు రిసార్ట్స్ భవన నిర్మాణాలు చేపట్టడానికి అనుమతులు ఇచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే గెడ్డ పోరంబోకు స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణ పనులను చూపుతున్న సిపిఎం నేతలు

ర్యాలీ చేపడుతున్న సొసైటీ సభ్యులు

గంజాయితో యువత భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు వారపు సంతలో గంజాయితో కలిగే అనర్థాలపై ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ వైస్ చైర్మన్ కిల్లో అప్పలస్వామి మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలు సేవించరాదన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్ కార్యాచరణాన్ని రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో చదువుకున్న యువత ఉన్నారని, చెడు దారులకు వెళ్లకుండా తమ జీవితాలకు మంచి మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూఢనమ్మకాలు విడనాడాలని, వాటిని నమ్మి ప్రాణాలు పోగొట్టుకోకూడదని అవగాహన పరిచారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎపి ప్రభుత్వం, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో నివసించే ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, భౌద్ధులు, జైనులు, పార్శీకులకు స్వయం ఉపాధి పథకం అవకాశాలు కల్పించినట్లు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షాంసున్నీషా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద మైనారిటీకి చెందిన వారికి 1 లక్ష నుండి రూ.8 లక్షల వరకు, క్రైస్తవ మైనారిటీ చెందిన వారికి రూ.లక్ష నుండి రూ.5 లక్షల వరకు వివిధ యూనిట్ల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపిక కాపాడిన దరఖాస్తుదారులకు 50శాతం సబ్సిడీ మంజూరు చేయబడుతుందన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు 21 నుండి 55 సంవత్సరాల మధ్య వయసు గలవారై, ఆంధ్రప్రదేశ్ పౌరులై మైనారిటీ వర్గానికి చెందినవారై ఉండాలని వివరించారు. అదే విధంగా దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్ జత చేయాలన్నారు. దరఖాస్తుదారు గత ఐదేళ్లలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీలు వినియోగించుకొని ఉండరాదని తెలిపారు. దరఖాస్తుదారు గ్రామీణ ప్రాంతంలో అయితే సంవత్సరానికి లక్ష రూపాయలు, పట్టణ ప్రాంతం వారు సంవత్సరానికి 1.50 లక్షల రూపాయలు లోపు ఆదాయం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తును మే 25వ తేదీలోపు https:/lapobmms.apdss.in అనే వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలంలో చీమలపాడు పంచాయతీ జెడ్.జోగుంపేట గిరిజన గ్రామంలో శనివారం కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 55మంది కి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మలేరియా వ్యాధిపై జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చునని వైద్యాధికారి మోహిని సురేఖ అన్నారు.

మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి-రంపచోడవరం

మేడే స్ఫూర్తితో మే 20 జరుగు దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన శనివారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ప్రపంప కార్మిక దినోత్సవం మేడేను కార్మిక వర్గం పెద్ద ఎత్తున నిర్వహించాలని, వాడవాడలా ఎర్ర జెండాలను ఎగరవేయాలని కోరారు. మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. ఎన్నో ఏళ్ల పాటు కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక కార్మిక హక్కులను కేంద్రంలోని మోడీ సర్కార్ కాలరాస్తుందని, వాటిని రద్దు చేసి, యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని తెలిపారు. ఈ నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు ఎంతో నష్టం జరుగుతుందని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతారని తెలిపారు. కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతారని, కట్టు బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నష్టం కలిగించే, కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చే ఈ లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీ, ఆశా వర్కర్లు, వెలుగు యానిమేటర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూలు శానిటేషన్ కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్ఏలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, ప్రకృతి వ్యవసాయ కార్మికులు, పంచాయతీ కార్మికులు ఇలా అని తరగతుల కార్మిక వర్గం మే 20న జరుగు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బొప్పెన కిరణ్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శాంతిరాజు, జిల్లా సహాయ కార్యదర్శి బి,నిర్మల, జిల్లా కమిటీ సభ్యులు కే రాణి, కే రామలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, రాజేశ్వరి, జి బేబీ రాణి, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

1న వాడవాడలా ఎర్ర జెండాలు ఎగరేయాలి

సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్

ప్రజాశక్తి-విఆర్ పురం

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే 1వ తేదీన వాడవాడలా ఎర్రజెండాలను ఎగరవేసి కార్మిక కర్షకుల ఐక్యతను చాటాలని సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లి అమరవీరుల స్థూపం వద్ద పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పంకు సత్తిబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ యజమానులు కార్మికులను యంత్రాల వలే పని చేయించి వారి శ్రమను దోపిడీ చేస్తున్న సమయంలో 1886లో చికాగో నగరంలో 18 గంటల పని వద్దని, ఎనిమిది గంటల పని ఉండాలని జరిగిన పోరాటం, కార్మికుల రక్తార్పణతోనే 8 గంటల పని విధానం వచ్చిందని తెలిపారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచే విధంగా, కార్మిక హక్కులను కాలరాసే విధానాలను అనుసరిస్తున్నారని తెలిపారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి, కార్మికుల హక్కులు హరించే విధంగా 4 లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేశారని తెలిపారు. ఈ లేబర్ కోడ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని తెలిపారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే పాలకులకు కనువిప్పు కలిగేలా వాడవాడలా మేడే ఉత్సవాలు నిర్వహించి, ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాబు బుర్రయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కారం సుందరయ్య, మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, గుండిపుడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, నాలారపు ప్రకాష్‌రావు, కుంజ కన్నయ్య, మొట్టం గంగరాజు, గొర్రె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

జిల్లా అదనపు న్యాయమూర్తిని సత్కరిస్తున్న న్యాయవాదులు

జిల్లా అడిషనల్ జడ్జిని కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఉమ్మడి తూర్పుగోదావరి 8వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి చెన్నయ్య నాయుడును రంపచోడవరం బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అడిషనల్ జిల్లా జడ్జి చెన్నయ్య నాయుడు, స్థానిక న్యాయవాది పి.బాబు రంపచోడవరంలోని జ్యుడీషియల్ కోర్టులో ఇన్స్పెక్షన్ నిమిత్తం శనివారం వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రఘురాం భగవాన్, ఉపాధ్యక్షులు కే.శివరంజని,ఇతర న్యాయవాదులు కలిశారు. స్థానికంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొనివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కేవిన్‌వి రమణ, డి శ్రీధర్, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. అత్యంత విలువైన ఈ స్టీల్‌ప్లాంట్ దేశానికే గర్వకారణమని, అటువంటి ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజలంతా ఐక్యంగా ఖండించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1535వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు లేకపోవడం వల్లే ఖర్చు అధికమై లాభాలు తక్కువగా వస్తున్నాయని అన్నారు. సొంతగనులు కేటాయిస్తే లాభాల బాటలో దూసుకుపోతుందని తెలిపారు. లక్షల మంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

జిల్లా అదనపు న్యాయమూర్తిని సత్కరిస్తున్న న్యాయవాదులు

ఉగ్రవాదుల దాడులపై సిఐటియు నిరసన

చోడవరం : ఉగ్రవాదుల దాడులకు నిరసనగా శనివారం సిఐటియూ, ఎల్ఐసి యూనియన్ ఆధ్వర్యంలో చోడవరం కొత్తూరు జంక్షన్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, అప్పారావు, వై.లోవరాజు నాగిరెడ్డి సత్యనారాయణ, చంద్రశేఖర్, కళ్యాణ్, శ్రీను పాల్గొన్నారు.

34 మంది హెచ్ఎంలకు మెమోలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలో 10వ తరగతి ఉత్తీర్ణత 80 శాతం కంటే తక్కువ ఉన్న 34 పాఠశాలల హెచ్ఎంలకు మెమోలు జారి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సగటు ఫలితాలు కన్నా తక్కువ శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలను దృష్టిలో పెట్టుకుని సంజాయిషీ కోరుతూ ఆయా హెచ్ఎంలకు మెమోలు జారి చేసినట్లు తెలిపారు. అదే విధంగా సబ్జెక్టుల వారిగా 80 శాతం కన్నా తక్కువ ఫలితాలు సాధించిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు కూడా సంజాయిషీ కోరుతూ మెమోలు జారీ చేయనున్నట్లు అయన తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ఈ నెల 28వ తేది నుండి జరుగు క్లాసులలో ఆయా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

డుంబ్రిగుడలో వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో శనివారం ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఏకధాటిగా కుండ పోత వర్షం కురిసింది. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఉక్కపోతకు గురవుతున్న మండల వాసులకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం కల్పించింది.

అభివృద్ధి పనులకు స్పీకర్ శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

నాతవరం :మండలంలోని మర్రిపాలెం కేజీబీవీ పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాల నిర్మాణానికి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంకృషి చేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండలం నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మండలం వేములపూడి కేజీబీవీలో రూ.164.02 లక్షలతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఏకంగా ఏడాది కాలంలో రూ. 90 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాదికి రూ.100 కోట్ల చొప్పున నిధులు అందితే, నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వేములపూడి పీహెచ్‌లో కూడా పడకల సంఖ్య పెంచేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వేములపూడిలో రోడ్డు విస్తరణకు స్థానికులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కపల్లి నూకాలమ్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, స్థానిక నాయకులు బోశెం రాంప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, జడ్పీటీసీ సుకల రమణమ్మ, ఆర్డీవో వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కోటపురట్ల:మండలంలో పందురు వరాహ నదిపై అసంపూర్తిగా నిలిచిన వంతెనకు హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇందులో భాగంగా 5.75 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం బుజ్జి, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, టిడిపి నాయకులు జానకి శ్రీను, జనసేన పార్టీ నాయకులు సంఘంపల్లి శ్రీనివాస్, పొందూరు సర్పంచ్ జగదీష్, తహసీల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలంలో చీమలపాడు పంచాయతీ జెడ్.జోగుంపేట గిరిజన గ్రామంలో శనివారం కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 55మంది కి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చునని వైద్యాధికారి మోహిని సురేఖ అన్నారు. దోమకాటుతో మలేరియా వ్యాధి వస్తుందని, ఈ దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమతెరలు వాడాలని చెప్పారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యపరీక్షలు చేయిం చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో..

లేబర్ కోడ్స్ రద్దు కోసం పోరాటం

సిఐటియు నేతల పిలుపు

సమావేశానికి హాజరైన సిఐటియు నేతలు

ప్రజాశక్తి-పాడేరు: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాల రాస్తోందని, అందుకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని ప్రయత్నిస్తుందని మే డే స్ఫూర్తితో ఐక్యంగా పోరాడి తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పాడేరు జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, మే ఒకటో తేదీన జరిగే మే డేను కార్మికులంతా జయప్రదం చేయాలన్నారు. కార్మికులను బానిసలుగా చేసి కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు లాభాలే ప్రాధాన్యంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ చట్టాల అమలు అయితే కనీస వేతనం, సంఘాలు పెట్టుకునే హక్కు, వంటి కోల్పోతామని తెలిపారు. కార్మికుడు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి ఉండదని తెలిపారు. ఇప్పటికే రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ విధానాలతో మరింతగా కార్మికుల బతుకులు దిగజారుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మోడీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం, వైసిపి, జనసేన వంత పాడటం బాధాకరమన్నారు. కార్మిక హక్కుల కోసం రక్తం చిందించి ప్రాణాలర్పించి సాధించిన చరిత్ర కార్మిక వర్గానికి ఉందని, కార్మికులు ఐక్యంగా పోరాడి 4 లేబర్ కోడ్స్ తిప్పికొడతామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ సమావేశానికి ముందు పహల్గం మృతులకు సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సుందర్‌రావు, శంకర్రావు, భగత్ రామ్, సత్యనారాయణ, అంగన్వాడి, ఆశ, గ్రామ వాలంటీర్స్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, జిసిసి కళాశాలు, భవన నిర్మాణరంగం, హాస్టల్స్, మెడికల్ అండ్ హెల్త్, కాఫీ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి

వేట నిషేధ భృతి చెక్కుల పంపిణీలో హోం మంత్రి వంగలపూడి

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకార గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన మత్స్యకార సేవ కార్యక్రమంలో భాగంగా వేట నిషేధ భృతి పంపిణీ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు వేటనిషేధ భృతి 20 వేలు ఇచ్చామన్నారు. ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్స్, స్టీల్ ప్లాంట్ రాబోతున్నాయని, స్థానికులకు శిక్షణ ఇచ్చి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్‌ను కోరడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో స్థానికులకు శిక్షణ ఇచ్చి, రాబోయే కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు రెసిడెన్సియల్ స్కూలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అడ్డురోడ్డులో మత్స్యకార మహిళలు చేపలు అమ్మడానికి వీలుగా 5 లక్షల నిధులతో షెడ్ నిర్మాణం చేపడతామని తెలిపారు.జిల్లా కలెక్టర్‌తో కలిసి మత్స్యకారులకు వేట నిషేధ భృతి చెక్కులు అందజేశారు. అనకాపల్లి జిల్లాలో 12,644 మంది లబ్ధిదారులకు 25 కోట్ల 28 లక్షల,80 వేలు, దీంట్లో పాయకరావుపేట నియోజకవర్గం సంబంధించి 7600 మంది లబ్ధిదారులకుగాను 14 కోట్ల 64 లక్షల, 80 వేల చెక్కులను పంపిణీ చేశారు. దీనికి ముందుగా మత్స్యకార నాయకులు వంకా రమణ, గోసల చిన తాతారావు, కాశీ విశ్వనాథం, ఎం.రాంబాబు, గరికిన సింహాద్రి, మెరుగు నాగేశ్వరరావు, అడవి రాజు మాట్లాడారు. తీర ప్రాంతాల్లో పరిశ్రమలు రాబోతున్నాయని, పొల్యూషన్ రాకుండా అరికట్టాలని, మత్స్యకారులకు ప్యాకేజీ ఇచ్చి, అన్ని విధాలా ఆదుకోవాలని, గురుకుల పాఠశాల మంజూరు చేయాలని కోరారు.50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు ఫించన్ మంజూరు చేయాలని, వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదవశాత్తు మృతి చెందితే, వెంటనే క్లెమ్ అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తీర ప్రాంతాల్లో విద్యుత్ సదుపాయం లేని చోట విద్యుత్ సౌకర్యం కల్పించాలని, రోడ్లు ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని, అర్హులైన మత్స్యకారులందరికి పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పి.ప్రసాద్, ఏడి జాస్మిన్, డిఆర్‌డిఎ పీడీ శచీదేవి, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నరసింహామూర్తి, నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, చిట్టిబాబు, అబద్ధం, జానకి శ్రీను, లాలం కాశీనాయుడు, దేవర సత్యనారాయణ, కొప్పిశెట్టి కొండబాబు, నూకరాజు, లక్ష్మణరావు, శ్రీకాంత్, రవిరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి వారపు సంత పరిశీలన

నక్కపల్లి వారపు సంతలో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న పాకలు ఈనెల 2న జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ మేరకు శనివారం హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ వారపు సంతను సందర్శించి దగ్ధమైన పాకలను పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, వారపు సంత ఆశీలు హక్కుదారులు దేవవరపు కొండలరావు, కొప్పిశెట్టి కొండబాబు తదితరులు సమస్యను హోం మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పాకలు కాలిపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిరు వ్యాపారాలకు పక్కా సదుపాయాలు కల్పించాలని కోరారు. సంతలో షెడ్డులు, రోడ్లు నిర్మాణం, ఇతర సదుపాయాలు కల్పించేందుకు గాను అంచనా వేయాలని పంచాయతీరాజ్ జె ఈ, ఎంపీడీవో సీతారామరాజుకు హోం మంత్రి అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహమూర్తి, మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, నాయకులు మీగడ సత్తిబాబు, గింజాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-కొత్తకోట: ఆటో బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడని కొత్తకోట ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. టి.అర్జాపురం పంచాయతీ చిలకవానిపాలెం గ్రామానికి చెందిన యాదగిరి కనకరాజు శుక్రవారం రాత్రి తన ఆటోలో అత్తవారిల్లు దొండపూడి గ్రామానికి వెళుతున్నాడు. అర్జాపురం శాస్త్రి గారి తోట సమీపంలో కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడిందని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన కనకరాజును హటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి బంధువులు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్సై చెప్పారు. మృతుడు కనకరాజు తండ్రి రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

లిక్విడ్ గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని దొగ్గవానిపాలెంలో శనివారం మధ్యాహ్నం రెండు కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పెందుర్తి సిఐ కెవి.సతీష్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో ఎస్ఐ స్వామి నాయుడు సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా గుంటూరు జిల్లాకు చెందిన మంద మార్తమ్మ, కంప జీసస్ కుమార్ గంజాయిని తరలిస్తుండగా గుర్తించి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. గుంటూరు నుంచి పాడేరు వచ్చి గంజాయిని సేకరించి పెందుర్తి రైల్వే స్టేషన్ మీదుగా తరలించడానికి నిందితులు ఏర్పాట్లు చేసుకోగా, పక్క సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నామని, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అవంతి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కోటవురట్ల: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చు కోవాలని అవంతి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల వద్ద క్యాంపస్ రిక్రూట్‌మెంట్ గేమ్ ప్లాన్‌లో భాగంగా పరిశ్రమ నాయకుల్ు హ్యూమన్ రిసోర్స్ నిపుణులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25 సంవత్సరాల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ విద్యను అందించాలనే ఉద్దేశంతో కళాశాల ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మట్టిలో లభించే మాణిక్యం వంటి వారని కొనియాడారు. అనంతరం నాగవీర్ ఉండవల్లి మాట్లాడుతూ, అకాడమిక్ మంచి ఉత్తీర్ణత సాధించి నప్పటికీ అవసరమైన నైపుణ్యాన్ని మెరుగు పరుచుకున్నప్పుడే విజయం సాధించగలుగుతామన్నారు, కృష్ణ చైతన్య మాట్లాడుతూ, కమ్యూనికేషన్ స్కిల్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ, ఐటిరంగం వేగంగా మారుతుందని విద్యార్థులు నైపుణ్య అంశాలపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు, అనంతరం విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌రావు అతిథులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు

- నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం సుందరకోటలో లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు జరుగుతున్నాయని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ లేటరైట్ దోపిడి వెనుక స్పీకర్ అయ్యన్నపాత్రుడు హస్తం ఉందో లేదో చెప్పాలన్నారు. ఈ ప్రాంతంలో లేటరైట్ పేరుతో కొన్ని వందల కోట్ల బాక్సైట్ తవ్వకాలు జరుగు తున్నాయన్నారు. దీనికి నర్సీపట్నం ప్రాంతంలో ఉన్న ఓ ప్రముఖ హోటల్ యాజమాని పాత్ర కీలకంగా ఉందన్నారు. దీనికి రాజమండ్రిలోని ఓ కంపెనీతో వందల కోట్లు బేరం కుదుర్చుకోవడమే కాకుండా ఆయన హోటల్‌లో ఆ ప్రాంత పెద్దలను పిలిపించి మాట్లాడటం జరిగిందన్నారు. 2022లో స్పీకర్ అయ్యన్న అక్రమ మైనింగ్‌పై పోరాటం అని పెద్ద ఎత్తున ఉద్యమం చేశారని, వందల వేలకోట్లు దోచేస్తున్నారని పెద్ద ఉద్యమం చేశారని, ఇప్పుడు నర్సీపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న బాక్సైట్ దోపిడిపై మీ హస్తం ఉందో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

విజ్ఞానానికి సాంకేతికత తోడైతే..

వైద్య రంగంలో మరిన్ని విప్లవాలు

ఎయిమ్స్‌కు ధీటుగా కెజిహెచ్ అభివృద్ధి - స్వర్ణాంధ్ర సాధనలో విశాఖ గేమ్ ఛేంజర్
ఆంధ్రా మెడికల్ కళాశాల సెంటినరీ భవన ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార విలేకరులు

విజ్ఞానానికి సాంకేతికత తోడైతే వైద్య రంగంలో మరిన్ని విప్లవాలు సాధ్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన విశాఖపట్నమే స్వర్ణాంధ్ర సాధనలో గేమ్ ఛేంజర్‌గా నిలువనుందని పేర్కొన్నారు. రెండు మూడేళ్లలో విశాఖపట్నంలో పెను మార్పులు సంతరించుకోనున్నాయన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు దాదాపు పూర్తయ్యిందని, అతి త్వరలోనే మెట్రో వస్తుందని, నిర్ణీత కాలంలోనే పూర్తవుతుందని తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాల సెంటినరీ భవన ప్రారంభోత్సవ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన రాష్ట్ర భవిష్యత్తు, సాంకేతిక విప్లవం వంటి అంశాలపై మాట్లాడారు. తొలుత రూ.50 కోట్లతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని, పైలాన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంబేద్కర్ ఆడిటోరియంను, డిజిటల్ లైబ్రరీ, విజ్ఞాన పరిశోధనా కేంద్రాలను రిమోట్ సాయంతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన భవన సముదాయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో పలు అంశాలపై మాట్లాడారు. అందరూ జన్మభూమి రుణం తీర్చుకోవాలనే సదుద్దేశంతో ఉండటం వల్ల ఆంధ్రా మెడికల్ కళాశాలలో అద్భుతమైన సెంటినరీ కట్టడం అందుబాటులోకి వచ్చిందన్నారు. దేశంలోనే అత్యంత పురాతన కళాశాల్లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఒకటి కావటం విశేషమన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎయిమ్స్‌కు ధీటుగా కెజిహెచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విషయమై ఇప్పటికే వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలోనే కీలకమైన విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఆర్థిక రాజధానిగా ఎదుగుతోందని, నాలెడ్జ్ హబ్‌గా మారుతోందని అన్నారు. పి-4 విధానం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని పటిష్టం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే అనకాపల్లిలో నైపర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, విశాఖ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎన్‌టిఆర్ యూనివర్శిటీ విసి పి.చంద్రశేఖర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎఎంసి ఛైర్మన్ టి.రవిరాజు, ఎఎంసి ప్రిన్సిపాల్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి, డాక్టర్ రవి వెంకటాచలం, డాక్టర్ బి.దేవీమాధవి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద, డాక్టర్ పెదవీర్రాజు పాల్గొన్నారు.

ఫొటో గ్యాలరీని ఆసక్తిగా తిలకిస్తున్న చంద్రబాబు

మాట్లాడుతున్న శేషాద్రి శేఖర్

ఎయు శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

- వర్సిటీ అభ్యున్నతికి కృషి చేయాలని వక్తల పిలుపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలోనే పేరెన్నికగన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం సాగర తీరంలో కాళీమాత ఆలయం వద్ద నుంచి ఎయు కన్వెన్షన్ సెంటర్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్, ఎయు అధికారులు, పూర్వ ఉపకులపతులు పాల్గొన్నారు. వందలాది మంది విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బంది తరలివచ్చారు. వాక్‌థాన్ ఎయు కన్వెన్షన్ సెంటర్ వరకూ కన్నుల పండువగా సాగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయ విశిష్టతను చాటే విధంగా విద్యార్థులు నినాదాలు ఇస్తూ, ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏడాది మొత్తం విభిన్న విద్య, సాంకేతిక, అవుట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే సంవత్సరం ఇదే రోజున ఘనంగా శతాబ్ది ఉత్సవ వేడుకలను నిర్వహిస్తామని వివరించారు.

సాయంత్రం బీచ్ రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధు మూర్తి హాజరై మాట్లాడారు. ఘనమైన వారసత్వం కలిగిన ఎయు అభ్యున్నతికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. జ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. భారతదేశానికి యువ జనాభా ఎంతో లాభదాయకమన్నారు. విద్య, పరిశోధన, ప్రజాసేవ రంగాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తనదైన శైలిలో ముందుకు వెళ్లాలని సూచించారు. విశిష్ట అతిథి ఐఐటి పాలకడ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ సమగ్ర విద్యను అందించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రాథమిక సూత్రాలు, శాస్త్ర సంబంధ అంశాలపై బలమైన పట్టు సాధించడం ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా తాను నిలవడానికిగల కారణం, సందర్భాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తనకు పాఠాలు బోధించి తన ఉన్నతికి పాటుపడిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విశాఖలో సేఫ్ డిపాజిట్ లాకర్ సర్వీస్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా గేటెడ్ కమ్యూనిటీలో అత్యంత సురక్షితమైన సేఫ్ డిపాజిట్ లాకర్ సర్వీసును విశాఖపట్నంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం సిరిపురంలోని ట్రైకూన్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైశాఖి డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్ బి.రామకృష్ణ మాట్లాడారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లు వైశాఖి డెవలపర్లు సంస్థ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆరమ్ అనే ప్రైవేటు సేఫ్ డిపాజిట్ లాకర్ కంపెనీ కలిసి పూర్తిగా ఆటోమేటెడ్ అయిన, స్విస్ బ్యాంక్ తరహా లాకర్లను తొలిసారిగా వైశాఖి స్కైపార్క్ కమ్యూనిటీలో ఏర్పాటు చేస్తోందన్నారు. దీంతో ఈ తరహా ప్రీమియం సదుపాయం ఉన్న మొట్టమొదటి కమ్యూనిటీగా వైశాఖి స్కైపార్క్ నిలవనుందన్నారు. ఇక్కడ రోజుకు 24 గంటలూ కమ్యూనిటీ వాసులు తమ లాకర్లను ఉపయోగించుకోవచ్చన్నారు. అక్కడ పూర్తి గోప్యత, భద్రత ఉంటాయని, దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులలో కలిపి ఇప్పుడు కేవలం 60 లక్షల బ్యాంకు లాకర్లు మాత్రమే ఉన్నాయని, దీన్ని గుర్తించిన వైశాఖి డెవలపర్లు ఆరమ్ సంస్థ అత్యాధునిక లాకర్ సిస్టంలను నేరుగా కమ్యూనిటీలకు తీసుకురావడం ద్వారా సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతోందన్నారు. స్కైపార్క్ కమ్యూనిటీలో తొలివిడతగా 400 లాకర్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇది వైశాఖి డెవలపర్లు, వ్యూహాత్మక భాగస్వామ్యంలో తొలి అడుగు అని చెప్పారు.

విశాఖలో ఇఎస్ఐ వైద్య కళాశాల నిర్మించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నంలో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయడం హర్షించదగిన విషయమని, అదే సందర్భంలో ఇఎస్ఐ వైద్య కళాశాలను కూడా విశాఖపట్నంలోనే ఏర్పాటు చేయాలని పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సిఐటియు నాయకులు కోరారు. శనివారం ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్ ఢిల్లీ నుంచి వచ్చి మల్కాపురంలో ఉన్న ఇఎస్ఐ హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆయనను కల